ఇవేనా మెరిసే రోడ్లు?



- సంక్రాంతి అన్నారు.. శివరాత్రి కూడా పోయింది
- అయినా మరమ్మతులకు నోచుకోని రోడ్లు
- గుంతలమయంగా మారిన రహదారులు
- అధ్వానంగా అర్బన్ కాలనీ రోడ్లు
- అవస్థలు పడుతున్న ప్రజలు

కల్లూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాయకులు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను సంక్రాంతికల్లా బాగు చేస్తామని ఊదరగొట్టారు. ఇప్పుడు శివరాత్రి కూడా పోయి రెండు వారాలవుతోంది. కనీసం రోడ్లపై గుంతలను కూడా పూడ్చలేకపోవడంతో వాహనదారులు, ప్రయాణికుల అవస్థల సంగతి అటుంచితే, రోడ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి.

కల్లూరు అర్బన్, కర్నూలు నగరంతో పాటు 52 వార్డుల్లో సుమారు 6.5 లక్షల మంది జనాభా ఉన్నారు. కల్లూరు అర్బన్‌లో 16 వార్డులు ఉండగా, అర్బన్ ప్రాంతం రోజురోజుకు విస్తరిస్తోంది. కాలనీలలో మౌలిక వసతులు మాత్రం కల్పించడం లేదని ప్రజలు వాపోతున్నారు.

రోడ్లన్నీ గుంతలమయం

రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కర్నూలు నగర శివారులోని జొహరాపురం నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్లే రహదారి అడుగడుగునా గుంతలు పడి ఉండటంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఈ రహదారి వెంట రోజూ మండల సంబంధిత వాహనాలు ఇందిరమ్మ కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, వెంకాయపల్లె, గార్గేయపురం వెళ్తుంటాయి. అయితే రోడ్డు గుంతలమయంగా ఉండటంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి కింద పడిన సంఘటనలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రోడ్లు బాగు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు దాటినా రోడ్లు వేయలేదని వాహనదారులు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మొత్తం దెబ్బతినడంతో ఎదురుగా ఏదైనా వాహనం వస్తే భయం భయంగా ప్రయాణించాల్సి వస్తోంది.

➤ అలాగే జొహరాపురం నుంచి నాల్గవ తరగతి కాలనీ వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డులో రాంప్రియ నగర్, యాగంటీశ్వరనగర్ తదితర కాలనీలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని ఆయా కాలనీలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

➤ 44వ నంబరు జాతీయ రహదారి నుంచి 28వ వార్డు లక్ష్మీపురం గ్రామానికి సుమారు రెండు కిలో మీటర్ల దూరం ఉంది. అయితే రోడ్డు మొత్తం గుంతలమయంగా మారింది. ఈ దారిలోనే కేజీబీవీ విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉన్నాయి. కేజీబీవీ విద్యాలయం ముందు గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డుపై లక్ష్మీపురం, దొడ్డిపాడు గ్రామాలకు చెందిన ప్రజలు, కళాశాల విద్యార్థులు, వ్యవసాయ కూలీలు నిత్యం తిరుగుతుంటారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న లక్ష్మీపురం రోడ్డు

రోడ్లను బాగు చేయండి



జొహరాపురం నుంచి వెంకాయపల్లె వరకు దెబ్బతిన్న రోడ్డును బాగు చేయాలి. ఈ దారిలో ఇందిరమ్మ కాలనీ, బీడీ వర్కర్స్ కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ, మజుందార్ నగర్, మణికంఠ హోమ్స్, వెంకాయపల్లె, పుల్యాల కళాశాల ప్రజలు, విద్యార్థులు నిత్యం ప్రయాణిస్తుంటారు. అలాగే కర్నూలు, నందికొట్కూరు మండలాలకు చెందిన గ్రామాల నుంచి కర్నూలు నగరంలోని పాతబస్టాండ్, ఆస్పత్రులకు, కళాశాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు అధ్వానంగా ఉండటంతో చాలా మంది ప్రమాదాలకు గురై ఆస్పత్రుల పాలై ఆర్థికంగా నష్టపోతున్నారు. రోడ్డు వేయడంతో పాటు ఇరువైపులా కాలువలు నిర్మించాలి. – ఎం.విజయ రామాంజనేయులు, సీపీఎం నగర కార్యవర్గ సభ్యుడు

ప్రజల ఇబ్బందులు తొలగించాలి



జొహరాపురం నుంచి నాల్గవ తరగతి కాలనీకి వెళ్లే రోడ్డు మొత్తం గుంతలు పడి అధ్వానంగా మారింది. రోడ్డును నిర్మించి ప్రజల ఇబ్బందులు తొలగించాలి. ఈ రోడ్డుపై నిత్యం రాంప్రియనగర్, యాగంటీశ్వరనగర్, నాల్గవ తరగతి కాలనీలతో పాటు ఇతర కాలనీలకు చెందిన వారు ప్రయాణిస్తుంటారు. రాత్రి సమయంలో రాకపోకలు సాగించలేని వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలి. – సి.ఇంద్రభవాణి, నాల్గవ తరగతి కాలనీ

పడితే అంతే సంగతులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం నుంచి దిగువపాడు గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై భారీ గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్అండ్‌బీ పరిధిలోని ఈ రోడ్డుపై హంద్రీ – నీవా కాలువ బ్రిడ్జి సమీపాన గుంతలు ఏర్పడ్డాయి. వాహనదారులు పొరపాటున అదుపుతప్పి పడితే అంతే సంగతులు. దిగువపాడు మీదుగా మిడుతూరు మండల కేంద్రానికి నిత్యం వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయి. ఈ రోడ్డు గుంతలమయంగా మారడంతో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళ ప్రయాణం నరకప్రాయంగా ఉందని, ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు చేపట్టి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు.



గార్గేయపురం నుంచి దిగువపాడుకు వెళ్లే రోడ్డుపై ప్రమాదకరంగా గుంతలు

క్లుప్తంగా

విద్యార్థుల నైపుణ్యాలను పెంపొందించాలి

సి.బెళగల్: ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థుల్లో విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ ఆదామ్‌బాషా సూచించారు. మండలంలోని కంబదహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్‌ఎం వెంకటరమణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి ఎంఈఓ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.. కాంప్లెక్స్ సమావేశంలో చర్చించే అంశాలు పాఠశాలలోని విద్యార్థుల పురోగతికి దోహదపడేలా ఉండాలన్నారు. కాగా బుధవారం సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్‌తో పాటు మండలంలోని కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోలకల్ జెడ్పీ హైస్కూల్లో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు నిర్వహించి టీచర్లకు పలు సూచనలు చేశారు.

నేడు కంటి వైద్య శిబిరం

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో గురువారం ప్రత్యేక కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సీహెచ్‌సీ డాక్టర్ ప్రశాంత్, కంటి వైద్య నిపుణుడు సంపత్‌లు తెలిపారు. బుధవారం వారు విలేకరులకు తెలియజేస్తూ, ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి, కర్నూలు వారి ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామంలోని ప్రాథమిక వైద్య కేంద్రం (పీహెచ్‌సీలో) గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కంటి పరీక్షలను నిర్వహిస్తారని వెల్లడించారు. కంటి వైద్యం బృందం ఉచితంగా కంటి పరీక్షలు, కళ్లజోళ్లు అవసరమైనట్టు చేస్తారని తెలిపారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, శిబిరానికి వచ్చే వారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులను తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలని సూచించారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

కోడుమూరురూరల్: కోడుమూరులోని మోడల్ స్కూల్లో 2025–26 సంవత్సరానికిగాను ఇంటర్ మొదటి సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశాల కోసం పదో తరగతి పూర్తయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఆశాజ్యోతి బుధవారం తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి మే 22వ తేదీలోగా నిర్ణయించిన రుసుం చెల్లించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, పదిలో వచ్చిన మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలియజేశారు.

14 నుంచి ఉరుసు మహోత్సవాలు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు, కాల్వ గ్రామాల్లో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకు ఉరుసు మహోత్సవాలు నిర్వహించనున్నట్లు దర్గా పీఠాధిపతులు ఎస్‌ఎండీ మహబూబ్ అల్లాషా ఖాద్రి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో వెలసిన హజరత్ సయ్యద్ అబ్దుల్ ఖాదర్ షా ఖాద్రి, హజరత్ సయ్యద్ గౌస్ మొహియుద్దీన్ షా ఖాద్రి స్వాముల వారి ఉరుసు సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా 14న గంధం, 15న ఉరుసు, 16న జియారత్ (పూజలు)కిస్తీ ఉంటాయన్నారు.

పారిశుద్ధ్య కార్మికుడి మృతి



మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న సర్పంచ్ వల్లభ

పాణ్యం: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు ఎర్రం ప్రవీణ్ (31) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. సర్పంచ్ మేకల వల్లభ, ఈఓ ఆనందరావు మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. వారి వెంట మేస్త్రీ గుర్రప్ప, సిబ్బంది కళ్యాణ్, పెద్దస్వామి తదితరులు ఉన్నారు.

హౌసింగ్ కాలనీలో అధికారుల పర్యటన



లబ్ధిదారులతో మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ అధికారి అజయ్‌కుమార్

కల్లూరు: మండల పరిధిలోని పెద్దటేకూరులోని ప్రభుత్వ హౌసింగ్ కాలనీలో జిల్లా హౌసింగ్ అధికారి అజయ్ కుమార్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఈఈ వెంకటరాముడు, డీఈఈలు ప్రభాకర్ తదితర అధికారులతో కలిసి కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులు ఇళ్లను సకాలంలో నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని హౌసింగ్ ఏఈ శ్రీకాంత్‌కు సూచించారు. మండలంలో ఇళ్లు నిర్మించుకుంటున్న ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు ప్రభుత్వం అదనంగా డబ్బు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మునిస్వామి, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి పూజ



గని జెడ్పీహై స్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

గడివేముల: మండల పరిధిలోని గని జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు బుధవారం సరస్వతి పూజ ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

గడివేముల: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ సూచించారు. బుధవారం మండల పరిధిలోని గడిగరేవుల సమీపంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. సొంత పొలం కలిగిన వారందరూ విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం నమోదు చేసుకోవాలన్నారు. విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్, జిల్లా ప్రకృతి వ్యవసాయం డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్ నరేంద్ర రెడ్డి, ఏఓ హేమసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు కృషి

పాణ్యం: నాటుసారా నిర్మూలనకు అందరూ సహకరించాలని నంద్యాల ఎక్సైజ్ ఎస్‌ఐ బ్రహ్మయ్య కోరారు. బుధవారం పిన్నాపురం గ్రామంలో నవోదయం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎల్లకృష్ణయ్య, వీఆర్‌ఓ వీరేంద్ర పాల్గొన్నారు.

వైభవంగా ప్రభోత్సవం



పోలకల్ చెన్నసోమేశ్వర స్వామి ప్రభోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో స్వయంభుగా వెలసిన చెన్నసోమేశ్వరస్వామి ఉత్సవాలలో భాగంగా బుధవారం తెల్లవారుజామున ప్రభోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయం నుంచి గంగాదేవి, పార్వతీదేవి సమేత చెన్నసోమేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ప్రభపై ఉంచి మేళతాళాలతో గ్రామంలో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. గ్రామంలో రెండు రోజుల పాటు ప్రభోత్సవ కార్యక్రమాలు ఉంటాయని, గురువారం తెల్లవారుజామున ప్రభోత్సవ కార్యక్రమాలు ముగుస్తాయని పెద్దలు తెలిపారు.

నేడు మహా రథోత్సవం

పోలకల్ గ్రామంలో గురువారం చెన్న సోమేశ్వరస్వామి వారి మహా రథోత్సవం నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాలు, పూజలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మహా రథోత్సవ సందర్భంగా గ్రామస్తుల సహకారంతో అన్నదాన కార్యక్రమం ఉంటుందని, రాత్రి 9 గంటలకు కళాకారులచే రేలారే రేలా, జానపద పాటలు, సినీ సంగీత విభావరి, మిమిక్రీ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి దేవర



బోనాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు



నందనపల్లెలో వెలసిన పెద్దమ్మవారు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని నందనపల్లె గ్రామంలో బుధవారం పెద్దమ్మ తల్లి దేవరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. 9 సంవత్సరాల అనంతరం జరిగే గ్రామ దేవరను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బోనాలను తలపై పెట్టుకొని డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి బోనాలను సమర్పించి పూజలు చేసి మొక్కుబడులు తీర్చుకున్నారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలిరావడంతో నందనపల్లె గ్రామం బంధుమిత్రులతో కిటకిటలాడింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తాలూకా అర్బన్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీధర్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయరాదు

కోడుమూరు రూరల్: బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేయరాదని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు సూచించారు. మండలంలోని వర్కూరులో సంచార వైద్య చికిత్స కార్యక్రమాన్ని ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక అనర్థాలకు దారితీసే ధూమపానానికి ప్రజలు వీలైనంత దూరంగా ఉండాలన్నారు. ధూమపానం వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, జీర్ణకోశ క్యాన్సర్, కడుపులో అల్సర్లు వంటి ప్రమాదకర జబ్బులు సోకే ప్రమాదముందన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి ధూమపాన రహిత దినోత్సవ పోస్టర్లను విడుదల చేశారు. కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మదనకుమార్, ఎంఎల్‌హెచ్‌పీ రసూల్, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్‌సాహెబ్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ధరణి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



అవగాహన పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు

మహిళా చట్టాలను అమలు చేయాలి

కల్లూరు: మహిళా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం నాయకురాలు ధనలక్ష్మి, సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు సుధాకరప్ప కోరారు. బుధవారం కల్లూరు అర్బన్ ముజఫర్‌నగర్‌లోని టీపీ లక్ష్మమ్మ కుట్టు మిషన్ సెంటర్ వద్ద మహిళా సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు.



సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



కోడుమూరులో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గడివేములలో కేకు కట్ చేస్తున్న దృశ్యం



సి.బెళగల్‌లో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు

కోడుమూరు రూరల్: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చి.. మాటకు కట్టుబడిన నాయకుడు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఆ పార్టీ కోడుమూరు మండలాధ్యక్షుడు రమేష్‌నాయుడు అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని కోడుమూరులో దివంగత మహానేత వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించడంతో పాటు, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమేష్‌నాయుడు మాట్లాడుతూ.. పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహానేత వైఎస్సార్ ఆశయ సాధనకై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ముంగిటకే పాలన తెచ్చి పార్టీలకతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలందించిన ఘనత తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన ముఖ్యమంత్రి చంద్రబాబు మోసకారితనం ప్రజలకు అర్థమైందన్నారు. పాలన చేపట్టి తొమ్మిది నెలలు దాటినా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను దారుణంగా మోసగించారని విమర్శించారు. రాబోయే రోజుల్లో సీఎం చంద్రబాబుకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని రమేష్‌నాయుడు హెచ్చరించారు. పార్టీ నాయకులు కృష్ణారెడ్డి, లింగన్న, రఘురామిరెడ్డి, లింగమూర్తి, సుబ్బారాయుడు, జగదీష్, రవి, శ్యామ్, వీరన్న, ధరణిరెడ్డి, పాలాక్షిరెడ్డి, గోపి, సురేష్, వెంకట్రావు, డీజే రాజు, మల్లేష్ తదితరులున్నారు.

సి.బెళగల్: కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సోమశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం పార్టీ శ్రేణులతో కలిసి ఘనంగా నిర్వహించారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి భారీగా తరలివచ్చిన పార్టీ నాయకులతో కలిసి దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఎంపీపీ బొంతల మునెప్ప, మండల కో–ఆప్షన్ సభ్యుడు ముల్ల హుసేన్, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, కార్యకర్తలతో కలిసి ఎగురవేశారు. పార్టీ మండల కార్యదర్శులు బాబుకటి మద్దిలేటి, ముందరింటి వెంకటేష్, గోపాల్, ఎస్‌ఎం బాషా, నాయకులు సీబీ గోవిందరెడ్డి, రఘురామిరెడ్డి, సర్పంచ్‌లు పాండురంగడు, దస్తగిరి, ఇమ్మానియేల్, శంకర్‌రెడ్డి, రంగారెడ్డి, పులిరాజు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

గడివేముల మండలంలో..

గడివేముల: మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు పార్టీ ఆవిర్భావ దినోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. గడివేములలోని పార్టీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు మధుసూదన్ గుప్తా కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ఆర్‌బీ చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ నాగమద్దమ్మ, ఎంపీటీసీ మహేశ్వర్ రెడ్డి, ఉప సర్పంచ్ బాలకిష్టన్న, నాయకులు నంద్యాల వెంకటేశ్వర్లు, రామకృష్ణ రెడ్డి పాల్గొన్నారు. బిలకల గూడూరు గ్రామంలో సొసైటీ మాజీ అధ్యక్షుడు పోగుల చంద్రశేఖర్ రెడ్డి, కరిమద్దెలలో పుల్లయ్య, డాలు స్వామి పార్టీ జెండాలను ఎగురవేశారు.

సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలి

కర్నూలు(సెంట్రల్): గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వర్క్ ఫ్రం హోం, ఎంఎస్‌ఎంఈ, పీ–4 సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం ఆయా అంశాలపై టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లతో సమీక్ష నిర్వహించారు. వర్క్ ఫ్రం హోం సర్వేకు సంబంధించి కర్నూలు అర్బన్‌లో 1.30 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే కౌతాళం, హొళగుంద, తుగ్గలి, పెద్దకడబూరు మండలాలు కూడా సర్వేలో వెనుకబడి ఉన్నాయని, వేగవంతం చేయాలని సూచించారు. ఎంఎస్‌ఎంఈ సర్వేకు సంబంధించి పత్తికొండ, మద్దికెర, కర్నూలు అర్బన్, హాలహర్వి, చిప్పగిరి, గూడూరు, ఆలూరు, ఆదోని మునిసిపాలిటీలు 100 శాతం పూర్తిచేసినట్లు చెప్పారు. అలాగే కౌతాళం, గోనెగొండ్ల మండలాల్లో ఎంఎస్‌ఎంఈ సర్వే వెనుకబడి ఉందని, నాలుగు నెలల నుంచి చెబుతున్నా నిర్లక్ష్యంతో ఉన్నారని ఎంపీడీఓలపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ నాసర రెడ్డిని ఆదేశించారు. జిల్లాలో పీ–4 సర్వే 98 శాతం పూర్తైందని, బాగా పనిచేశారని ఎంపీడీఓలను అభినందించారు. ఇందులో కూడా కౌతాళం మండలం వెనుకబడి ఉందని చెప్పారు. సిటిజన్ ఈ–కేవైసీలో జిల్లా చాలా వెనుకబడి ఉందని త్వరగా పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను చిత్తశుద్ధితో పరిష్కరించాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

భూసమస్యలపై దృష్టి సారించండి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: భూ సమస్యలపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం పాణ్యం పార్టీ కార్యాలయం వద్ద పలు గ్రామాల నాయకులతో సమావేశమయ్యారు. రెవెన్యూ సమస్యలు పరిష్కారించడంతో అధికారులు ఆలస్యం చేస్తున్నారని పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. వెంటనే ఆయన రెవెన్యూ అధికారులకు ఫోన్ చేసి రైతుల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. పిన్నాపురం, తమ్మరాజుపల్లె గ్రామాల్లో సాగులో ఉన్న వారి కంటే కొత్త వారు మతకు హక్కు ఉందటూ తెరపైకి వస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారించి అసలైన రైతులెవరో తేల్చాలని కోరారు.

సూపర్ సిక్స్‌కు ఎగనామం

ఎన్నికల ముందు ప్రజలకు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలకు ఎగనామం పెట్టి ప్రతిపక్ష పార్టీల నాయకులపై తప్పుడు కేసులు బనాయిస్తోందని కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. కేవలం తొమ్మిది నెలల పాలనకే ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. ప్రజలే రోడ్డుపైకి వచ్చి సమస్యలపై నిరసన చేసేంతగా కూటమి పాలన ఉందన్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణ రెడ్డి, మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి, నాయకులు సుబ్రహ్మణ్యం, చందమామ బాబు, శేషయ్య, అశోక్‌రెడ్డి, సత్యాలు, ఎల్లగౌడ్, టైలర్ బాషా, చిన్న ఎల్లసుబ్బయ్య పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్ రెడ్డి

బ్లడ్ బ్యాంకుల తనిఖీ

కర్నూలు (హాస్పిటల్): కర్నూలులోని పలు బ్లడ్ బ్యాంకులను బుధవారం అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ తనిఖీ చేశారు. ముందుగా రాజ్‌విహార్ సెంటర్‌లోని కేర్ బ్లడ్ బ్యాంకుకు వెళ్లారు. అక్కడ స్టాఫ్ ఎవరూ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం ల్యాబ్ టెక్నీషియన్ ఒక్కరితోనే బ్లడ్ బ్యాంకు నిర్వహించడం, రికార్డులు సరిగా నిర్వహించకపోవడంపై మండిపడ్డారు. వారంలోగా సరైన సంజాయిషీ ఇవ్వకపోతే బ్లడ్ బ్యాంక్‌ను సీజ్ చేస్తామని హెచ్చరించారు. అనంతరం అక్షయ, విశ్వభారతి, న్యూలైఫ్ బ్లడ్ బ్యాంకులను ఆయన తనిఖీ చేశారు. అక్కడి సిబ్బంది వివరాలు, రక్త సేకరణ, రక్త నిల్వల వివరాలను సేకరించారు. జిల్లాలో మొత్తం 13 బ్లడ్ బ్యాంకులు ఉన్నాయని, వీటన్నింటినీ అంచెల వారీగా తనిఖీ చేయనున్నట్లు ఆయన చెప్పారు.